క్రీడలతో డ్రగ్స్‌కు చెక్

- ఆటలు బంద్ కావడంవల్లే డ్రగ్స్ కల్చర్ విస్తరిస్తోంది
- క్రీడాభివృద్ధికి సంపూర్ణ మద్దతు
- స్పోర్ట్స్ పాలసీ 2025 ప్రకటించిన సిఎం రేవంత్

స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో క్రీడా విధానం తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలన్న ఉద్దేశంతోనే ప్రైవేటు -పబ్లిక్ భాగస్వామ్యంతో క్రీడాపాలసీని రూపొందించామని తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న కార్పొరేట్ సంస్థలు, ఆ రంగంలో విశేష అనుభవం ఉన్న వారిని ఆహ్వానించే ఒక బోర్డును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో పాల్గొని సిఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ నూతన క్రీడా విధానాన్ని ప్రకటించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు, ప్రముఖ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఈ కాంక్లేవ్‌లో పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రానున్న రోజుల్లో మంచి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ పాలసీ తెచ్చాం. ఒక రోజు సదస్సు నిర్వహించి వదిలేయడానికి కాదు. వచ్చే రోజుల్లో ఈ దేశాన్ని ముందుకు నడిపించడానికి, ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి. ఈ వేదికలో పాల్గొన్న క్రీడాకారులంతా తెలంగాణ క్రీడా పాలసీలో భాగస్వాములే. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలి. ఇది కొత్త ఆరంభం. ఇందుకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. క్రీడాభివృద్ధికి ఎలాంటి మద్దతు కావాలన్నా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందరం కలిసి ముందుకు సాగుదాం. తెలంగాణ పేరును ప్రపంచం ముందు నిలపడంలో అందరి మద్దతు ఉండాలి. నగరాలు, పట్టణాల్లో క్రీడామైదానాలు లేక, క్రీడలను ప్రోత్సహించే పరిస్థితులు లేని కారణంగా కాలేజీలు, విద్యా సంస్థల్లో యువత పెడదారులు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా సరైన విధానాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహించని కారణంగానే మాదక ద్రవ్యాలు వేగంగా విస్తరించే ప్రమాదం ఏర్పడుతోంది. మాదక ద్రవ్యాల వినియోగమే కాదు, అవి తెలంగాణలో అడుగు పెట్టాలంటే వణుకు పుట్టాలి. అందుకోసమే ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. 1956 ఒలింపిక్స్ క్రీడలో హైదరాబాద్ నుంచి తొమ్మిది మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్న చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. అక్కడి నుంచి ప్రారంభిస్తే ఆ తర్వాత ఎందరో క్రీడాకారులు ఇక్కడి నుంచి రాణించారు. అలా రాణించిన వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలు, నగదు ప్రోత్సహకాలు, ఉద్యోగాలు కల్పించడం వంటి అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చదువులోనే కాదు క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. గడిచిన పది పదిహేను సంవత్సరాల కాలంలో క్రీడలకు ప్రోత్సహం లేక మైదానాలు ఫంక్షన్ హాళ్ళుగా మారాయి. ఇటీవలి ఒలింపిక్స్‌లో భారత్ 71 వ స్థానంలో ఉందంటే అందరూ ఆలోచించాలి. చిన్న దేశమైన దక్షిణ కొరియా 32 స్వర్ణ పతకాలు సాధిస్తే అందులో ఒక అమ్మాయి ఏకంగా మూడు స్వర్ణాలు సాధించారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒక్క స్వర్ణం కూడా రాకపోవడం విచారకరం. 2036 ఒలింపిక్స్ నిర్వహించాలని దేశం ముందుకు వెళుతున్న నేపథ్యంలో కనీసం రెండు క్రీడలనైనా తెలంగాణలో నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని కోరాం. దేశం ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న దశలో క్రీడల్లో కూడా బలంగా నిలవాలి. అందుకే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో క్రీడాభివృద్ధి లక్ష్యాల కోసం ప్రత్యేక చాప్టర్ పెట్టాం. ఆ లక్ష్య సాధన దిశగానే క్రీడల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న వారందరినీ ఈ వేదికపైకి ఆహ్వానించాం' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

అసమానతల్లేని సమాజమే లక్ష్యం

- వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో, రాష్ట్రంలో అమ్మాయిలపై లైంగిక దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బేటి బచావో, బేటి పడావో అని చెప్పే ప్రధాని మోడీ ఈ దేశంలో గంటకు కొన్ని వేల లైంగిక దాడులు, యాసిడ్ దాడులు జరుగుతున్నా స్పందించడం లేదన్నారు. సమాజంలో వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. అసమానతల్లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. గతంలో అమ్మాయిలకు హాస్టల్, పాఠశాలలు, కాలేజీల్లో శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా ఇచ్చేవారని గుర్తు చేశారు. దాన్ని పునరుద్ధరించాలని కోరారు. శనివారం హైదరాబాద్ నగర సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం మమత అధ్యక్షతన విద్యార్థుల రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. శానిటరీ నాప్కిన్స్‌పైన జీఎస్టీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లు, గురుకులాలు, కెజిబివిల్లో అమ్మాయిలకు సరైన సదుపాయాల్లేక సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ, వసతులను మెరుగుపర్చాలని కోరారు. అమ్మాయిలు సరైన ఆహారం తీసుకోక అనారోగ్యం బారిన పడుతున్నారనీ, రక్తహీనతకు గురవుతున్నరని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలకు పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను ధరలకనుగుణంగా పెంచాలని కోరారు. విద్యార్థులందరూ మహనీయుల చరిత్రలు తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీలం, ద్వంద్వర్థాలు వచ్చే వీడియోలు, డ్రగ్స్, గంజాయి, మద్యం, సిగరెట్ లాంటి సంస్కృతి విద్యార్థినీల్లో కూడా ప్రభావం చూపుతున్నదని అన్నారు. వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలన్నారు. ప్రభుత్వాలు మహిళల విద్యకు నిధులు కేటాయించి, బాలికల వసతి గృహాలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సదస్సులో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సంబంధించిన ప్రణాళికను రాష్ట్ర కన్వీనర్ ఎం పూజ ప్రవేశ పెట్టారు. ఈ సదస్సులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి నాగరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దీపికా, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, సుమ, కార్తీక్, రమేష్, అవినాష్, నిక్షిప్త, జ్ఞాపిక, శివాని, కీర్తన, వసంత, రత్నవేణి, హేమలత, శివాని తదితరులు పాల్గొన్నారు.

జాబ్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎఫ్ఎల్ఒ మాజీ జాతీయ అధ్యక్షురాలు పింకీ రెడ్డి

నగరంలో ఎఫ్ఎల్ఒ జాబ్ ఫెయిర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ మహిళల వ్యాపార సంస్థ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఒ) ఆధ్వర్యంలో మొట్టమొదటి జాతీయ ఎఫ్ఎల్ఒ జాబ్ ఫెయిర్‌ను సికింద్రాబాద్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఏర్పాటు చేసింది. శనివారం ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ఎఫ్ఎల్ఒ మాజీ జాతీయ అధ్యక్షురాలు పింకీ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎఫ్ఎల్ఓ జాతీయ వైస్ చైర్‌పర్సన్ కామిని సరాఫ్ ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ జాబ్ ఫెయిర్ ఎఫ్ఎల్ఒ చరిత్రలో తొలి జాతీయ స్థాయి కార్యక్రమంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇది మహిళలు, యువతకు నేరుగా ఉద్యోగ, నైపుణ్య అవకాశాలను అందిస్తోందని తెలిపారు.

బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న కేంద్రం

- బిజెపి నేతలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
- ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

విలేకరులతో మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్‌ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా మల్హార్‌రావు మండల కేంద్రమైన తాడిచెర్లలో పలు అభివృద్ధి పనులను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి రాష్ట్రపతికి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదం లభించలేదన్నారు. బిసి రిజర్వేషన్ కోసం క్యాబినెట్‌లో నిర్ణయించి ఆర్డినెన్స్ తెచ్చినప్పటికీ ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వెంటనే బిసి రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5,6,7 తేదీలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామన్నారు. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు బిసి రిజర్వేషన్ చట్టం చేయకుండా.. ఇవాళ బిఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ లబ్ది కోసం నిందలు, ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వారికి బీసీ రిజర్వేషన్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే జంతర్ మంతర్ వద్ద ధర్నాలో హితవుపలికారు.

ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర

- యువ పట్టభద్రులు రైతులకు సేవలందించాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికాన్ని రూపుమాపి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. అగ్రికల్చర్ కోర్సుల్లో పట్టభద్రులైన యువత రైతులకు నిరంతర సేవలందిస్తూ సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. 2021-2022 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యుజి, పిజి, పిహెచ్‌డి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 1965లో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం చాలా గర్వకారణమని అన్నారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విశ్వవిద్యాలయం పనిచేస్తూ తన ప్రయాణాన్ని సాగిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. యూనివర్శిటీ ఇటీవల నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు', 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాలతో రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణ మార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం.. నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందని అన్నారు. అందుకు శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమనే దోహదం చేశాయన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. అత్యుత్తమ ప్రతిభగల కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందజేశారు. కంది అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని భార్గవి అత్యధిక ఓజీపీఏ సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థిని అర్షియా తబస్యుమ్ బీఎస్సీ అగ్రికల్చర్‌లో అత్యధిక ఓజీపీఏ సాధించినందుకు నాలుగు బంగారు పతకాలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బెకర్‌తో సిమంధర్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యం

హైదరాబాద్ : భారత్‌లో సిపిఎ, సిఎంఎ కోర్సులను మరింత ఎఐ నైపుణ్యాలతో అందించడానికి బెకర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సిమంధర్ తెలిపింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బెకర్ ప్రెసిడెంట్ ఎడ్ క్లార్క్‌తో కలిసి సిమందర్ ఎడ్యుకేషన్ కో ఫౌండర్ శ్రీపాల్ జైన్ మాట్లాడుతూ.. భారత్‌లో సిపిఎ, సిఎంఎ విద్యార్థుల కోసం బెకర్‌తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని తెలిపారు. బెకర్ అంతర్జాతీయ విశ్వసనీయతను సిమంధర్ స్థానిక నైపుణ్యంతో కలిపి ఎఐ ఆధారిత అధ్యయన సాధనాలు, ప్రత్యక్ష కోర్సులు, కెరీర్ ప్లేస్‌మెంట్‌లను అందించనున్నామన్నారు. ఏడాది కాలపరిమిత కలిగిన సిపిఎ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఏడాదికి సగటున రూ.7 లక్షల వేతనంతో ఉద్యోగం లభిస్తుందన్నారు. భారతదేశంలో తమ కార్యకలాపాలు 300 శాతం పెరిగాయని బెకర్ ప్రెసిడెంట్ ఎడ్ క్లార్క్ తెలిపారు.

మతాల మధ్య వైషమ్యాలే బిజెపి లక్ష్యం

- నకిలీ ఓటర్ల ప్రక్షాళన పేరుతో మైనార్టీలను తగ్గించే కుట్ర
- ఎస్‌వికె వెబినార్‌లో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతాల మధ్య వైషమ్యాలు పెంచి, తద్వారా హిందూత్వ రాజ్య స్థాపన లక్ష్యాన్ని సాధించే ప్రక్రియలో భాగమే నకిలీ ఓటర్ల ప్రక్షాళన పేరుతో సాగుతున్న తంతు అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. 'ఓటర్ల జాబితా సవరణలో ఇసి అనుసరిస్తు పద్ధతి-దాని పర్యవసానాలు' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయ కుమార్ అధ్యక్షతన వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకు దేశంలో మైనార్టీల జనాభాను తగ్గించే ప్రక్రియను బిజెపి సాగిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే బీహార్‌లో నకిలీ ఓటర్ల ప్రక్షాళన పేరుతో సుమారు 65లక్షల ఓట్లను తొలిగించారని చెప్పారు. దీనికి ఇసి చెప్పే సమాధానం హేతుబద్ధంగా లేదన్నారు. ఈ విషయంపై సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం దగ్గర తగిన సమాధానం లేదని చెప్పారు. ఆధార్ కార్డు అన్నింటికీ పనికొచ్చినప్పుడు ఓటరు గుర్తింపునకు ఎందుకు పనికి రాదో చెప్పాలని కోర్టు అడిగిన ప్రశ్నకు జవాబు లేదన్నారు. నకిలీ కార్డులు సృష్టించే ప్రమాదం ఉందనే సమాధానాన్ని కోర్టు సహేతుకం కాదని చెప్పిందని గుర్తు చేశారు. పైగా ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్ పోర్జరీ చేయలేరో చెప్పాలంటూ ఇసిని ప్రశ్నించిందని తెలిపారు. నకిలీ ఓటర్లు తగ్గించేదే నిజమైతే..65లక్షల ఓటర్లు ఎలా తగ్గుతాయని కూడా న్యాయస్థానం ప్రశ్నించిందన్నారు. ఓటర్ల ప్రక్షాళన పారదర్శకంగా ఉండాలని సూచించిందని గుర్తు చేశారు. వాస్తవంగా ఒక ఓటును తొలగించాలంటే..న్యాయపరమైన ప్రక్రియ కొనసాగాలన్నారు. సంబంధిత ఓటరుకు నోటీసు పంపిచే దగ్గరనుంచి పలు రకాల ప్రక్రియలున్నాయని గుర్తు చేశారు. ఇదో బీహార్‌లోనే జరుగుతున్న విషయం కాదనీ, దేశం మొత్తం ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తుందని చెప్పారు.దీనికి ప్రధాన కారణం హిందూత్వ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోవటమే లక్ష్యమని వివరించారు. ఈ కుట్రలో భాగమే రకరకాల ప్రక్రియలను సందర్భమొచ్చినప్పుడల్లా బిజెపి వాడుకుంటుందని చెప్పారు. మతతత్వానికి, మతోన్మాదాన్ని వ్యతిరేకించే శక్తులను హిందూ మత వ్యతిరేకులుగా ప్రచారం చేస్తున్నదని చెప్పారు. సనాతన ధర్మం పేరుతో మనుధర్మాన్ని తీసుకొచ్చి భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర సాగుతున్నదని చెప్పారు. అందులో భాగంగానే సోషలిజం, సెక్యులరిజం అనే పదాలని తొలగించాలంటూ చర్చ చేస్తున్నారని గుర్తు చేశారు. మైనార్టీలను శత్రువుగా చూపించి, మెజార్టీ హిందూవులను ఒకటి చేసుకుని రాజకీయ లబ్దిపొందాలనుకుంటున్నదని తెలిపారు. మోడీ, ట్రంప్ అదే ఎత్తుగడలను అనుసరిస్తున్నారన్నారు. నియంతృత్వ విధానాలను, నియోఫాసిస్టు లక్షణాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. ఇందుకు కార్పొరేట్ శక్తులు మతోన్మాదులకు అండగా ఉంటున్నాయని వివరించారు. యుద్ధం పట్ల ప్రభుత్వం అనుసరించిన విధానంపై పార్లమెంట్‌లో ఎంపీలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మోడీ సర్కారు నీళ్లు నములుతున్నదని వివరించారు. ట్రంప్, మోడీ స్నేహం ఏ పాటిదో మన దేశంపై 25శాతం సుంకాలు విధించటంతో తేటతెల్లమైందని తెలిపారు.

'కాళేశ్వరం'లో కెసిఆర్‌కు జైలు తప్పదు

- టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, కెసిఆర్‌ను దోషిగా జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని, ఇక ఆయనకు జైలు తప్పదని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సంగుపేటలోని లక్ష్మీదేవి ఫంక్షన్‌హాల్‌లో శనివారం కాంగ్రెస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐసిసి నేత, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్ల రూపాయలు కొల్లగొటి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కమిషన్ తేల్చి చెప్పిందన్నారు. ఇంజినీర్లు చెప్పినా కేసీఆర్ వినకుండా ప్రాజెక్టు విషయంలో తన సొంత లాభం కోసం.. ఇష్టం ఉన్న చోట ప్రాజెక్టును కట్టించారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం రూ.40 వేల కోట్లు కాగా, కమీషన్‌ల కోసం రూ.లక్షన్నర కోట్లకు పెంచారని, రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రాజెక్టు ఫిల్లర్లు కుంగితే ఏమైతదని కేటీఆర్ ఎద్దేవా చేసి మాట్లాడారని, కూలుతున్న ఇంట్లో మీ కుటుంబాన్ని ఉంచుతారా? అని ప్రశ్నించారు. ఈ-ఫార్ములా కారు రేసు కేసులో కెటిఆర్ అడ్డంగా దొరికిపోయారని, ప్రభుత్వ సొమ్ము తిన్నది ఏవరైనా కక్కాల్సిందేనని మహేష్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కెసిఆర్, హరీశ్‌రావు సంతకాలతోనే బనకచర్ల ప్రాజెక్టు కడుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని, నెలకు రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తే, ఇందులో రూ.6500 కోట్లు వడ్డీనే చెల్లిస్తున్నామని, ఆర్థికపరమైన ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను మాత్రం ఆపడం లేదన్నారు. రాష్ట్ర ట్రైకార్ కార్పొరేషన్ చైర్మెన్ బెల్లా నాయక్, మెదక్ గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌లు అంజయ్య, సువాసిని రెడ్డి, మహిళా నాయకులు గిరిజాషేట్కార్ పాల్గొన్నారు

అర్హులందరికీ రేషన్ కార్డులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇవ్వనుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా మర్పల్లి, బంట్వారం మండలాల్లో ఆయన పర్యటించారు. కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. బంట్వారం మండలంలో 744 కార్డులు, మర్పల్లి మండలంలో 75 కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో స్పీకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పేదలకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. దాంతో అర్హులు సంక్షేమ పథకాలు కోల్పోయారని చెప్పారు. ప్రజల దరఖాస్తులను నాటి ఎమ్మెల్యేలు, మంత్రులు చెత్తబుట్టలో వేశారని విమర్శించారు. రేషన్‌కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వికారాబాద్ నియోజకవర్గంలో ప్రధాన రోడ్లతోపాటు అన్ని గ్రామాల్లోనూ రోడ్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు గుండెల్లో పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ పాల్గొన్నారు.

ఇల్లు కోసం స్పీకర్ ఎదుట మహిళ మొర

తనకు స్థలం లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, ఇంటి స్థలం కేటాయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని బంట్వారం మండలానికి చెందిన ఓ మహిళ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. తనకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనికి స్పీకర్ స్పందిస్తూ.. బాధిత మహిళకు స్థలం ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు.

ఏప్రిల్‌లో ఐఎఫ్ఎటి ప్రదర్శన

న్యూఢిల్లీ : పర్యావరణ సాంకేతిక రంగానికి కొత్త ప్రోత్సాహం ఇచ్చేలా ఏప్రిల్ 22-24 తేదీల్లో ఢిల్లీలో ఐఎఫ్ఎటి -2026ను ఏర్పాటు చేస్తున్నారు. ముంబయిలో విజయవంతమైన 11వ ఎడిషన్‌ల తర్వాత, మెస్సే ముయెంచెన్ ఇండియా దీన్ని ఢిల్లీకి తీసుకొస్తోన్నట్లు పేర్కొంది. "ఐఎఫ్ఎటి ఢిల్లీ భారతదేశ పర్యావరణ సాంకేతిక రంగానికి కీలకమైన క్షణం, ఆవిష్కరణలను విధాన కార్యాచరణలో భాగం చేస్తుంది," అని మెస్సే సిఇఒ, ఐఎంఇఎ ప్రెసిడెంట్ భూపిందర్ సింగ్ తెలిపారు.

Before The VIII Addl. Motor Accident Claims Tribunal : Nellore, A.P.
M.V.O.P.No. 698 / 2022

1. Davuluri Manoj and 3 others - Claimants
Vs
1. Bathala Ashok Kumar (Owner of Car) and 2 others - Respondents

Notice

To,
R2. M.Naveen Kumar, (Driver of Car),
S/o **M.Radhakrishna Murthy,**
Subash Nagar, Quthbullapur, Medchal,
Telangana State.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే13-08-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

డి.రమేష్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి. 102/2024

బాణావత్ శంకర్‌నాయక్ .... పిటీషనర్
వర్సెస్
బాణావత్ కంశెలి ..... రెస్పాండెంట్

టు,
బాణావత్ కంశెలి, భర్త: బాణావత్ శంకర్‌నాయక్
తండ్రి: రమావత్ కోటియనాయక్,
వయసు: 51 సం॥లు, హిందూ, గృహిణి,
నివాసం: పెద్దగట్టు గ్రామం,
పి.ఎ.పల్లి మండలం, నల్గొండ జిల్లా.
తెలంగాణ రాష్ట్రం-508243.
సెల్: 7386729520.

పైనెంబరు హెచ్.ఎం.ఓ.పి.లోని పిటీషనరుకు నీవు భార్యవై ఉన్నందున, నీనుండి విడాకులు మంజూరు చేయమని కోరుతూ పిటీషనరు నీ పైన పైకోర్టులో, పై నెంబరు హెచ్.ఎం.ఓ.పి.ని దాఖలు చేసినందున, ఇందు విషయమై నీకు పలుమార్లు నోటీసులు పంపగా, అవినీకు ముట్టని కారణం చేత, ఈ దినపత్రిక నోటీసు ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 18-08-2025వ తేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల నీపరోక్షమందు హెచ్.ఎం.ఓ.పి. పిటీషన్‌ను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 18-08-2025
మార్కాపురం

యద్దనపూడి అనిల్‌కుమార్,
పిటీషనర్ తరపు అడ్వకేట్
సెల్: 8985468259.

ORTIN GLOBAL LIMITED
(Formerly known as Ortin Laboratories Limited)
CIN: L68200TG1986PLC006885
6 D. No. 1-8-305, Ground Floor, Chikkadpally, Musheerabad (Delivery), Hyderabad, India, 500020, Telangana. Phone No.: 9052011118
Email ID: info@ortinlabsindia.com Website: www.ortinlabsindia.com

అసాధారణ సర్వసభ్య సమావేశం, పుస్తక ముగింపు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ సమాచార ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఇజిఎం నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు ("వీసి")/ఇతర ఆడియో విజువల్ మీన్స్ ("ఓఏవిఎం") ద్వారా ఆర్టిన్ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో ఆర్టిన్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్‌గా తెలిసినది) యొక్క సభ్యుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజిఎం) సోమవారం, 25 ఆగస్టు, 2025న మ.3.00గం.లకు నిర్వహించబడును.

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108లోని నిబంధనల ప్రకారం, కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 (సవరించబడిన)లోని రూల్స్ 20తో చదవగల మరియు సెబీ(లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 (సవరించబడిన)లోని రెగ్యులేషన్ 44 మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ("ఎంసిఏ") దీని జనరల్ సర్క్యులర్ నెం.09/2024 తేది.19.09.2024 మరియు సెబీ దీని సర్క్యులర్ SEBI/HO/CFD/CFDPoD-2/P/CIR/2024/133 తేది.3 అక్టోబర్, 2024 (ఇకపై సమిష్టిగా "సర్క్యులర్లు" అనిసూచిస్తారు) అనుసరించి, వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి) లేదా ఇతర ఆడియో విజువల్ మీన్స్ (ఓఏవిఎం) ద్వారా అసాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించడంపై స్పష్టత"కి సంబంధించి, సామ్మిడి వేదిక వద్ద సభ్యుల భౌతిక హాజరు లేకుండా, వీసి/ఓఏవిఎం ద్వారా అసాధారణ సర్వసభ్య సమావేశాన్ని ("ఇజిఎం") నిర్వహించడానికి అనుమతించబడింది. కంపెనీల చట్టం, 2013 ("చట్టం"), సెబీ(లిస్టింగ్ ఆబ్లిగేషన్స్‌అండ్ డిస్క్లోజర్ రిక్వైర్మెంట్స్) రెగ్యులేషన్స్,2015 ("సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్") మరియు ఎంసిఏ సర్క్యులర్ల నిబంధనలకు అనుగుణంగా, కంపెనీ యొక్క ఇజిఎం అనునది వీసి/ఓఏవిఎం ద్వారా నిర్వహించబడుతోంది.

ఇజిఎం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలు తేది.మే 12, 2020నాటి సెబీ సర్క్యులర్ ప్రకారం కంపెనీ/ డిపాజిటరీలలో ఇమెయిల్ ఐడిలు నమోదుచేసుకున్న వాటాదారులందరికి 02.08.2025న పంపబడినవి మరియు స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్ అనగా వరుసగా బిఎస్ఇ లిమిటెడ్ మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా: www.bseindia.com మరియు www.nseindia.com నుండి కూడా యాక్సెస్ చేయవచ్చు.

సభ్యులు https://emeetings.kfintech.com లో కెఫిన్ అందించిన వీసి/ఓఏవిఎం సౌకర్యం ద్వారా 'వీడియో కాన్ఫరెన్స్' ట్యాబ్‌పై క్లిక్ చేసి, కెఫిన్‌టెక్ అందించిన వారి రిమోట్ ఇ-ఓటింగ్ లాగిన్ క్రెడెన్షియల్స్ ఉపయోగించడం ద్వారా ఇ-ఇజిఎంకు హాజరు కాగలరు. సభ్యుల లాగిన్‌లో ఇ-ఇజిఎం కోసం లింక్ అందుబాటులో ఉంటుంది, ఇక్కడ మీరు ఈవెంట్ మరియు కంపెనీ పేరును ఎంచుకోవచ్చు. ఇ-ఓటింగ్ కోసం యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ లేని లేదా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను మరచిపోయిన సభ్యులు ఇజిఎం కి నోటీసులో పేర్కొన్న సూచనలను అనుసరించడం ద్వారా దానిని తిరిగిపొందవచ్చు.

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 91 ప్రకారం, కంపెనీ సభ్యుల రిజిస్టర్ & వాటా బదిలీ పుస్తకాలు 19.08.2025 నుండి 25.08.2025 వరకు (రెండు రోజులతో కలిపి) అసాధారణ సర్వసభ్య సమావేశం కోసం మూసివేయబడతాయి.

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108 మరియు సెబీ(ఎల్ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 44 ప్రకారం, కెఫిన్‌టెక్ యొక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ (రిమోట్ ఇ-ఓటింగ్) ద్వారా ఇజిఎం నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై ఎలక్ట్రానిక్ విధానం ద్వారా ఓటువేసే సౌకర్యాన్ని కంపెనీ అందిస్తోంది. సభ్యులందరికి ఈ క్రింది సమాచారం ఇవ్వబడింది:

1) ఇజిఎం నోటీసులో పేర్కొన్న వ్యాపార లావాదేవీలు ఎలక్ట్రానిక్ విధానంచే ఓటింగ్ ద్వారా నిర్వహించబడును.
2) రిమోట్ ఇ-ఓటింగ్ 22.08.2025న ఉ.09.00గం.లకు ప్రారంభమగును.
3) రిమోట్ ఇ-ఓటింగ్ 24.08.2025న సా.5.00గం.లకు ముగియును.
4) ఇజిఎం వద్ద లేదా ఎలక్ట్రానిక్ విధానంచే ఓటు అర్హతను నిర్ణయించుటకు కటాఫ్ తేది: 18.08.2025
5) కంపెనీ వాటాలను కలిగియున్న మరియు ఇజిఎం నోటీసు డిస్పాచ్ తరువాత కంపెనీ యొక్క సభ్యుడి మారినా ఎవరైనా వ్యక్తి, evoting@kfintech.com వద్ద అభ్యర్థను పంపించుటచే లాగిన్ ఐడి& పాస్‌వర్డ్‌ను పొందవచ్చును.
6) రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్‌కు సౌకర్యం ఇజిఎం సమయంలో కూడా లభించును మరియు వీసి వసతి ద్వారా ఇజిఎంలో హాజరగు సభ్యులకు, రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానాలపై వారి ఓటును వినియోగించని లేదా ఇతరత్రా వారు ఇజిఎం వద్ద ఇ-ఓటింగ్ సిస్టం ద్వారా ఓటును పొందుటకు అర్హులని సభ్యులు గమనించగలరు. ఇజిఎంకు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్‌చే వారి ఓటును వినియోగించిన సభ్యులు ఇజిఎం కూడాను హాజరు కావచ్చును కానీ మళ్లీ ఓటును వినియోగించుటకు అనుమతి ఉండదు.
7) సభ్యులు వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయని వారు, అసాధారణ సర్వసభ్య సమావేశపు యొక్క నోటీసు కాపీలను స్వీకరించుటకు డిపాజిటరీలు/ కంపెనీ/ రిజిస్ట్రార్& షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ అనగా కెఫిన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోవాలి.
8) విచారణల విషయంలో, సభ్యుల కొరకు తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూస్) మరియు https://emeetings.kfintech.com వద్ద వాటాదారులకు ఇ-ఓటింగ్ యూజర్ మ్యానువల్‌ను పరిశీలించండి లేదా సంప్రదించండి మురళీ క్రిష్ణమూర్తి సంక, మేనేజింగ్ డైరెక్టర్, డోర్ నెం.1-8-305, గ్రౌండ్ ఫ్లోర్, చిక్కడపల్లి, ముషీరాబాద్ (డెలివరీ) హైదరాబాద్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500020, ఇమెయిల్ ఐడి: info@ortinlabsindia.com. ఫోన్ నెం.9052011118.

For and on behalf of the Board
Ortin Global Limited
(Formerly known as Ortin Laboratories Limited)
Sd/-
S. Murali Krishna Murthy
Managing Director
(DIN: 00540632)

Date: 02-08-2025
Place: Hyderabad

గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా మందమర్రి కెకె-5 గని ప్రమాదంలో ఆర్కేపీకి చెందిన కార్మికుడు శ్రావణ్‌కుమార్ (32) మృతి చెందారు. శుక్రవారం 2వ షిఫ్ట్‌లో ఎస్‌డిఎల్ యంత్రాన్ని పరిశీలిస్తుండగా 20డీప్ 32 అప్ లెవెల్ వద్ద అకస్మాత్తుగా సైడ్ వాల్ కూలింది. ఈ ఘటనలో శ్రావణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు, అధికారులు వెంటనే కెకె1 డిస్పెన్సరీకి, అక్కడ నుంచి రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో రాత్రి 9 గంటలకు శ్రావణ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం ఏరియా ఆస్పత్రికి వచ్చి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తక్షణ పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భద్రతా ప్రమాణాలపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సాంకేతిక, భద్రతాపరంగా తగిన సంస్కరణలు తీసుకురావాలని సింగరేణి ఉన్నతాధికారులను ఆదేశించారు.

నేడు దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి ఆదివారం సీట్ల కేటాయింపు జరగనుంది. దోస్త్ ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ గతనెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. ఆదివారం దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈ నెల మూడు నుంచి ఆరు వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు గడువున్నది. ఈ నెల నాలుగు నుంచి ఆరు వరకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ద్వైపాక్షిక ఒప్పందాలకు వ్యతిరేకంగా 13న నిరసనలు

- సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా, బ్రిటన్ దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాల వల్ల మన దేశ వ్యవసాయ రంగం, రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు తెలిపారు. ఈ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడారు. మరోవైపు ఈ ఒప్పందాలు జాతీయ ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తాయన్నారు. సామ్రాజ్యవాద శక్తులకు మోడీ ప్రభుత్వం లొంగిపోతోందని విమర్శించారు. గతంలో ఇటువంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నీ భారతీయ రైతులు, చిన్న పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయని గుర్తు చేశారు. మాసం, పాలకూర, పుట్టగొడుగులు, పుచ్చకాయలు, సీతాఫలం, మామిడి, మామిడి గుజ్జు, అరటిపండ్లు, కరివేపాకు, చింతపండు మొదలైన కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు కూడా తీవ్రమైన ప్రభావాన్ని దెబ్బతీశాయని తెలిపారు. సుగంధ, ప్రాసెస్ చేసిన సుగంధ ద్రవ్యాలు, మొక్కజొన్న పిండి, రైపిండి, బ్రౌన్ రైస్ పిండి, మొక్క జొన్న ఓట్స్, షుగర్ బీట్, తమలపాకులు, కోకో బీన్స్, కోకో పౌడర్, మాల్టెడ్ మిల్క్ తదితర ఉత్పత్తులు కూడా సుంకాల జాబితాలో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే 'ఆపరేషన్ సిందూర్'

- ట్రంప్ ప్రచారం నిజమా..? అబద్ధమా..?
- ప్రపంచానికి అబద్ధాలు చెబుతున్న మోడీ అనుకూల మీడియా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం ఒంటరి పోరు
- కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌పై చేసిన దాడిని బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. యుద్ధాన్ని తానే ఆపినట్టు చెబుతున్న అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రచారం వెనుక నిజముందా..? అబద్ధం ఉందా...? మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఎం కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరిగిన ప్రతి సంఘటననూ బిజెపి రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న తీరును తమ్మినేని ప్రస్తావించారు. ఆపరేషన్ సింధూర్‌ను ఏ దేశమూ ప్రోత్సహించలేదని, ఉగ్రవాదాన్ని మాత్రమే ఖండించిందని అన్నారు. పెహల్గాం దాడిలో పాల్గొన్న పాకిస్తాన్ ఉగ్రవాదుల్లో ఎంత మందిని చంపారో కేంద్ర ప్రభుత్వం చెప్పలేకపోతోందన్నారు. ఆపరేషన్ సింధూర్‌పై విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రం వద్ద సరైన సమాధానం లేదన్నారు. యుద్ధంలో ఎన్ని విమానాలు కూలాయో చెప్పాలన్నారు. ప్రధాని మోడీ తన అనుకూల మీడియాతో ప్రపంచానికి అబద్ధాలు చెప్పిస్తున్న తీరును ఖండించారు. అంతర్జాతీయ చానళ్లు భారత ప్రభుత్వ మీడియాను అవహేళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ట్రంప్ మోడీకి మిత్రుడైనప్పటికీ 25 శాతం టారిఫ్ వేయడంలో వెనుకంజ వేయలేదన్నారు. ప్రస్తుతం బ్రిటన్‌తో జీరో టారిఫ్‌తో మోడీ చేసుకున్న ఒప్పందం భవిష్యత్‌లో వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, వస్తువులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఓటర్ల తొలగింపుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని చెప్పారు. ఈసీ, బిజెపి వ్యవహరిస్తున్న తీరును సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని అన్నారు. స్థానిక ఎన్నికలో ప్రస్తుతానికైతే సిపిఎం ఒంటరిగా వెళ్లే ఆలోచనలో ఉందని, అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఎపిలో కలిపిన ఐదు గ్రామాలను వెనక్కి రప్పించాలి : పోతినేని సుదర్శన్

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, ఎపిలో కలిపిన 5 గ్రామాలను తిరిగి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలంకు తీవ్ర ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. అయోధ్య రామాలయ అభివృద్ధే కాదని, భద్రాద్రి దేవాలయాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని, నిజమైన అర్హులకి కేటాయించాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్‌ను పాత డిజైన్ ప్రకారమే నిర్మించి భద్రాద్రి జిల్లా ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే.రమేష్, సీనియర్ నాయకులు ఎలమంచిలి రవికుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, ఎం.జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య ఉన్నారు.

విద్యాదాఘాతంతో బాలుడు మృతి

- మానవ హక్కుల కమిషన్ సీరియస్
- రూ.5 లక్షల పరిహారం, అధికారులపై చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాదాఘాతంతో బాలుని మరణానికి సంబంధించిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని టీజీట్రాన్స్‌కోకు సిఫారసు చేసింది. దుర్ఘటనకు దారి తీసేలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్లకు చెందిన బి.శ్రేయాన్ (10) విద్యుద్ఘాతంతో మరణించారు. ఈ ఘటనకు సంబంధించిన కేసును డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన కమిషన్ విచారించింది. ఆ ఘటన జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గతంలో ఒక ఆవు, ఒక కుక్క మరణించినా అధికారులు స్పందించలేదు. ఆ భద్రత లేని ట్రాన్స్ ఫార్మర్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఫిర్యాదుదారుని కుమారుడు శ్రేయాన్‌కు కూడా అక్కడ దుర్మరణం పాలయ్యారు. రాష్ట్రంలో అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత పరిస్థితిపై నివేదికను సమర్పించాలని కమిషన్ కోరింది. ఆయన సంఘటనల నివారణకు నిత్యం తనిఖీ చేయాలని ఆదేశించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని 60 రోజుల్లో కమిషన్‌కు తెలపాలని ఆదేశించింది. కమిషన్ సిఫారసుల అమలుపై 90 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని కూడా కమిషన్ ఆదేశాల్లో పేర్కొంది.

డిఇఓలుగా ఐఎఎస్‌ల నియామకం నిబంధనలకు విరుద్ధం

- సిఎస్‌కు ఎమ్మెల్సీ కొమరయ్య లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఇఓలుగా ఐఎఎస్ అధికారులను నియమించడం నిబంధనలకు విరుద్ధమని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె రామకృష్ణారావుకు ఆయన శనివారం లేఖ రాశారు. డిఇఓలు, డిప్యూటీ ఇఓలుగా అధికారులకు ఎఫ్ఎసి బాధ్యతలను అప్పగించేటపుడు నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరారు. అర్హతలు, నిబంధనలను పక్కనపెట్టి తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. డిఇఓ, డిప్యూటీ ఇఓ పోస్టులకు కనీస అర్హతగా సాధారణ డిగ్రీతోపాటు బిఎడ్ తప్పకుండా ఉండాలని పేర్కొన్నారు. బిఎడ్ అర్హతల్లేని అధికారులను ముఖ్యంగా ఐఎఎస్ అధికారులకు డిఇఓ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. విద్యారంగంలో నైపుణ్యాలు, విద్యాపరమైన అనుభవం అవసరమైన చోట పరిపాలనా కోణంతో తీసుకునే నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాలంటే తగిన అర్హతలు, అనుభవం ఉన్న వారికే పదవులను అప్పగించాలని కోరారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

బనకచర్లను అడ్డుకుంది మేమే..

- ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మించి తీరుతాం
- కమీషన్ల కోసమే బిఆర్ఎస్ తహతహ
- లోకేశ్‌ను కెటిఆర్ ఎందుకు కలిశారో చెప్పండి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద జలాలతో తెలంగాణ ప్రాజెక్టులు పూర్తవ్వక ముందే బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తే ఊరుకునేది లేదని, అడ్డుకొని తీరుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని రాజుగారి కోట దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలతో కలిసి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడుతూ.. కోయిల్‌సాగర్, భీమా, జూరాల, శ్రీశైలంతోపాటు నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే పూర్తి చేశామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్ని అడ్డంకులొచ్చినా ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టునూ నిర్మించి తీరుతామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్మించిన ప్రాజెక్టులన్నీ కమీషన్ల కోసమే మొదలు పెట్టారని ఆరోపించారు. పదేండ్లు అధికారంలో ఉండి ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కృష్ణానదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంతో రహస్యంగా కుదుర్చుకున్న ఒప్పందం వల్లే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. అప్పుడే ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు పక్క రాష్ట్రంతో సమస్యలు వచ్చి ఉండేవి కావన్నారు. లోకేశ్‌తో కేటీఆర్ రహస్యంగా ఎందుకు కలిశారో చెప్పాలన్నారు. ప్రజాపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ప్రాంతంలో సాంకేతిక విద్య అందించడం కోసం అడ్వాన్స్ ఐటీఐ పాఠశాలను నిర్మిస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు లక్ష కోట్లు అందిస్తున్నామన్నారు. సోమశీల సిద్ధేశ్వరం బ్రిడ్జితో పాటు జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేసి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపరుస్తామని చెప్పారు. తెలంగాణలో సాగునీటి సమస్య తీర్చడానికి రాయలసీమ జూరాల మధ్య ఆనకట్ట నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరుతోపాటు తెలంగాణ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాతే బనకచర్లపై ఆలోచన చేయాలని ఏపీకి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కోత్వాల్, డీసీసీబీ అధ్యక్షులు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, సరిత తిరుపతయ్య యాదవ్, జగదీశ్వరరావు, కొడిదల రాము పాల్గొన్నారు.

'సృష్టి' కేసులో మరో ముగ్గురు అరెస్ట్

- 11కు చేరిన నిందితుల సంఖ్య
- అన్ని కోణాల్లో విచారిస్తున్న పోలీసులు
- మరిన్ని అరెస్టులకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇప్పటికే 8 మందిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం ఒకరిని అరెస్టు చేయగా, శనివారం మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దాంతో అరెస్టయిన నిందితుల సంఖ్య 11కు చేరింది. విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఇద్దరినీ ఐదు రోజులపాటు కస్టడీకి సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. వారికి గాంధీ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించారు. పూర్తిస్థాయిలో విచారణ అనంతరం నిందితులు చెప్పిన విషయాలను బట్టి ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలున్నాయి.

అస్సాం నుంచి వ్యవహారం

సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి పెద్దఎత్తున డబ్బులు దండుకున్నారు. అస్సాంకు చెందిన మహిళలు ధనశ్రీ, సంతోషి ద్వారా పేద దంపతుల వద్ద అప్పుడే పుట్టిన పిల్లలను కొనుగోలు చేసి.. కావాల్సిన దంపతులకు(ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న) వారి బిడ్డగా అప్పగించేవారు. మరోవైపు నింబధనలకు విరుద్ధంగా వీర్యం, అండాలను సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు. సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ కేసులో సంతోషి కీలకంగా వ్యవహరించినట్టు, ఆమె మాటలను నమ్మిన బాధితులు భారీగా మోసపోయినట్టు పోలీసులు గుర్తించారు. సంతోషి, నమ్రత చైల్డ్ ట్రాఫికింగ్‌కి పాల్పడ్డారన్న కోణంలోనూ విచారణ చేపట్టారు.

నోరు విప్పని నమ్రత

తెలుగు రాష్ట్రాలతోపాటు మరో నాలుగు రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రత భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా, సులువుగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలన్న ఉద్దేశంతో పెద్దఎత్తున మహిళా ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. శిశువుల క్రయవిక్రయాల్లో ఏజెంట్లు సహకరించడంతో వారందరికీ భారీగా నజరానాలు ఇచ్చారని పోలీసులు గుర్తించారు. గ్రామీణ ప్రాంతాలే టార్గెట్‌గా మెడికల్ క్యాంపులు, ఉచితంగా ఫెర్టిలిటీ సేవలు చేస్తానని క్యాంపులు నిర్వహించినట్టు తెలిసింది. క్యాంపులకు వచ్చిన దంపతులకు పిల్లలు కలుగుతారంటూ డాక్టర్ నమ్రత నమ్మించేది. ఐవీఎఫ్ బదులు సరోగసీకి రెఫర్ చేసి.. దాని కోసం దంపతుల నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని సమాచారం. దంపతులను నమ్మించేందుకు సంతోషినితోపాటు ఇతర ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేసి సరోగసీ ద్వారా పుట్టారంటూ బాధిత దంపతులకు డాక్టర్ నమ్రత అందించి అదనపు డబ్బులు లాగేదని విశ్వసనీయ సమాచారం. ఇదిలావుండగా పోలీసుల విచారణలో మాత్రం నమ్రత నోరువిప్పడం లేదని తెలిసింది. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా గుర్తులేవని చెపుతున్నట్టు సమాచారం.

నివేదికను మంత్రి ఉత్తమ్‌కు అందజేస్తున్న రైతు కమిషన్ నాయకులు

చెరువుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి

- ఉత్తమ్‌తో రైతు కమిషన్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో రైతు కమిషన్ భేటీ అయ్యింది. ఇందులో కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సభ్యులు రాములునాయక్, గడుగు గంగాధర్, భవానీరెడ్డి ఉన్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ పలు సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు ఉన్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారనీ, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లేఅవుట్లు వేయడం, నీటివనరులకు వచ్చే క్యాచ్‌మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. అయితే ప్రధానంగా చెరువులు కుంచించుకుపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని కమిషన్ చెప్పింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకోవడానికి సమగ్రమైన విధానం అవసరమని రైతు కమిషన్ అభిప్రాయపడింది. ఆ విధానాన్ని కమిషన్ తయారు చేయనున్నట్టు తెలియజేసింది. నిపుణులతో విధాన పత్ర తయారీకి ప్రత్యేక సమావేశం కోసం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానానికి మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్టు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

నిస్వార్థ ప్రజా సేవకులు పింగళి వెంకయ్య

- హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజావక్తి - కల్చరల్

అపరిమిత దేశభక్తికి, నిస్వార్థ ప్రజా సేవకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ప్రతీక అని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. అలాంటి నిస్వార్థ సర్వోదయ కార్యకర్త గోవిందరాజు వెంకట సుబ్బారావును వెంకయ్య పేరిట అవార్డును బహూకరించడం సముచితంగా ఉందని అభినందించారు. త్యాగరాయ గానసభలోని కళా దీక్షితులు కళా వేదికపై వంశీ ఇంటర్నేషనల్ నిర్వాహణలో పింగళి వెంకయ్య 148వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోవిందరాజు వెంకట సుబ్బారావుకి పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన జాతీయ జెండాను గాంధీజీ సూచన మేరకు వెంకయ్య రూప కల్పన చేశారనీ అన్నారు. భూదాన ఉద్యమంలో మధ్య పాన నిషేధం అమలు కోసం ఉద్యమించిన వెంకట సుబ్బారావు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ దేశ ఆత్మ గౌరవ ప్రతీక జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య అని కొనియాడారు. పురస్కార గ్రహీత వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఎన్ని అవార్డులు పొందినా.. తొంభై రెండు ఏళ్ళ వయసులో వెంకయ్య అవార్డ్ అందుకోవటం గర్వంగా ఉందని ధన్యవాదాలు తెలిపారు. పింగళి వెంకయ్య మనువడు నరసింహం మాట్లాడుతూ గత ప్రధానులెవరూ పింగళి వెంకయ్యను జాతీయ జెండా రూప కర్తగా పేర్కొన లేదనీ, నరేంద్ర మోడీనే ఇటీవల పింగళి వెంకయ్య పేరు ప్రస్తావించి గౌరవించారని గుర్తు చేసుకున్నారు. వేదికపై సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, కాగడా పత్రిక మా శర్మ తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు కార్యక్రమ నిర్వహణ చేశారు. డాక్టర్ సుధా దేవి స్వాగతం పలికారు. ఫణి కశ్యప్, ప్రసన్న, రాధా రాణి, రమాదేవి తదితరులు దేశ భక్తి గీతాలను మధురంగా ఆలపించారు.

50 సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారు?

- సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీకి 50 సార్లు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి ఏం సాధించారు? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.సిఎం ఢిల్లీ పర్యటనలతో నయాపైసా ప్రయోజనం కలగలేదని తెలిపారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ, నరేంద్రమోడీ, చంద్రబాబుల ముద్దుల బానిసగా తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పాలించే ముఖ్యమంత్రి కావాలి కాని, ఢిల్లీకి విహార యాత్రలు చేసే టూరిస్ట్ సిఎం అవసరం లేదన్నారు. ముగ్గురు యజమానుల ముద్దుల బానిస అయిన రేవంత్ రెడ్డి తన మొదటి బాస్ రాహుల్ గాంధీకి నోట్ల కట్టల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నారని ఆరోపించారు. రెండో యజమాని మోడీకి సన్నిహితులైన వ్యాపారవేత్తలకు తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి కేసుల నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు. మన అన్నదాతల కడుపు కొట్టి తెలంగాణ జల సంపదను తన మూడో యజమాని చంద్రబాబుకు దోచి పెడుతున్నారన్నారని చెప్పారు. ఢిల్లీ యాత్రలతో రాష్ట్రానికి సాధించింది ఏమిటో దమ్ముంటే రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క కొత్త ప్రాజెక్టుకు అనుమతులు కాని, అదనంగా కేంద్రం నుంచి నిధులు, రాష్ట్రం కోసం ఓ ప్యాకేజీ అయినా సాధించారా అని ప్రశ్నించారు. బనకచర్లతో వ్యవసాయ రంగం పెను సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలంగాణ తల్లడిల్లుతుంటే రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబుకు వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడడం లేదని తప్పుపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీళ్లు రాక రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే సిఎంకు సోయి లేదన్నారు. హామీలు అమలు చేయని రేవంత్ రెడ్డి తెలంగాణకు తెచ్చింది.... శుష్కప్రియాలు..శూన్య హస్తాలే అని కేటీఆర్ విమర్శించారు.

యూరియాపై తప్పుడు లెక్కలు

- కేంద్ర మంత్రిపై తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ సాక్షిగా తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. యూరియా సరఫరాపై లోక్‌సభలో శనివారం జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి అనుప్రియకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయింపుల ప్రకారం రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తప్పుడు లెక్కలు చెప్పడం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. దీని మూలంగా రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. జులై నెల వరకు సరఫరా కాని యూరియాతోపాటు ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా అందించాలని విజ్ఞప్తి చేశారు. వానాకాలం సాగు దృష్టిలో పెట్టుకుని యూరియా సరఫరా వేగవంతం చేయాలని కోరారు.

న్యాయవ్యవస్థపై నమ్మకముంది : కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తప్పుడు వార్తలు రాసి ఆనందపడటం సరికాదని మంత్రి కొండా సురేఖ హితవు పలికారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై నమోదు చేసిన పరువు నష్టం దావాపై రెండు రోజుల క్రితమే కాగ్నిజెన్స్ తీసుకుని ముందుకు వెళ్లాలని కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. దీనికే కొందరు అత్యుత్సాహంతో వార్తలు రాస్తున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థ మీద తమకు గౌరవముందని పేర్కొన్నారు. ఏ కేసులో అయినా కోర్టు కాగ్నిజెన్స్ తీసకోవాలని చెప్పడం సాధారణమని తెలిపారు. కోర్టులు, కేసులు తమకు కొత్తకాదని పేర్కొన్నారు.

కేంద్రం సహకరించకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఆగవు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం సహకరించకపోయినా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఆగబోవని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉన్నప్పటికీ రేవంత్‌రెడ్డి ఆలోచనకనుగుణంగా ఇండ్ల నిర్మాణాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. ఇండ్ల నిర్మాణ నిధుల కోసం తాము కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడలేదని చెప్పారు. కేంద్రం అనేక నిబంధనలతో కొర్రీలు వేస్తున్నదని విమర్శించారు. ఒక్కొక్క ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.52 లక్షలు మాత్రమే కేంద్రం ఇస్తున్నదనీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.ఐదు లక్షలు కేటాయించిందని తెలిపారు. కేంద్రం సూచించిన రీ సర్వే తుది దశలో ఉందని చెప్పారు. వాస్తవానికి లబ్దిదారుల ఎంపికలో కేంద్ర నిబంధనల కంటే రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలే పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు.

'తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు, సాహిత్యం' పుస్తకం ఆవిష్కరణ

డిప్యూటీ తహశీల్దార్ డాక్టర్ పైళ్ల నవీన్‌రెడ్డి రచించిన 'తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు, సాహిత్యం' ఐదవ ఎడిషన్ పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. తన ఛాంబర్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను ఆయన ఆవిష్కరించారు. మూస పద్ధతిని వదిలి సరికొత్త ఆలోచనా విధానంతో ప్రస్తుత పోటీ పరీక్షలకనుగుణంగా పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు.